ఫీజు బకాయిలు విడుదల చేయాలి



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కాచిగూడ: విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే విద్యార్థుల చదువులు కొనసాగేది ఏలా అని ప్రశ్నించారు. బుధవారం నారాయణగూడలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారినా విద్యార్థుల జీవితాలు మాత్రం మారడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వమే తూట్లుపొడుస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నేతలు గ్యార నరేష్, చైతన్యయాదవ్, లెనిన్, అనిల్‌కుమార్, హర్ష, పవన్, వెంకట్, శింబు తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో విధులు నిర్వర్తించాలి

హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ పళని కదిరవన్



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ పళని కదిరవన్



గ్రంథాలయ ఉద్యోగుల సత్కార కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్‌తో కార్యదర్శి పద్మజ

చిక్కడపల్లి: గ్రంథాలయ ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ పళని కదిరవన్ కోరారు. బుధవారం అశోక్‌నగర్‌లోని వట్టికోట ఆళ్వారు స్వామి నగర కేంద్ర గ్రంథాలయం ప్రాంగణంలో జరుగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు వేడుకలో కదిరవన్ ముఖ్యఅతిథిగా పాల్గొని వివిధ స్థాయిలలోని గ్రంథాలయ ఉద్యోగులు సత్కరించారు. నగర కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి పొట్లూరి పద్మజ మాట్లాడుతూ.. గ్రంథాలయం విద్యార్థుల కోసం , పోటీ పరీక్షల అభ్యర్థులు కోసమే కాకుండా అందరికి అందుబాటులో వుండే విధంగా ఉంచామని అని సామాన్య ప్రజలు కూడా గ్రంథాలయానికి రావాలని కోరాలని కోరారు. ఉద్యోగుల సంఘం నాయకులు చాంగటి అయోధ్య కార్యక్రమానికి స్వాగతం పలికారు. కార్యదర్శి బొల్లం మహేందర్ నివేదిక సమర్పించారు. విశ్రాంత ఉద్యోగులు సంఘం నాయకులు కొక్కుల దేవేందర్, తమ్మ సత్యనారాయణ, వరప్రసాద్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణి నాట్య మయూరి

కూచిపూడి ప్రదర్శనతో ప్రశంసలు అందుకుంటున్న ఆరేళ్ల చిన్నారి





గోనె నారాయణిని సన్మానిస్తున్న అరుణాచలం ఆలయం ప్రతినిధులు

నల్లకుంట: అరచేతిలో ఇమిడిన సాంకేతిక విప్లవం మోజులో పడిపోయిన నేటి యువతరానికి ఆదర్శంగా నిలుస్తోంది ఆరేళ్ల చిన్నారి గోనె నారాయణిరావు. ఆమెకు తల్లిదండ్రుల ప్రోత్సాహం తోడవడంతో విద్యతో పాటు శాస్త్రీయ నృత్యం వైపు అడుగులేస్తూ.. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటుతోంది. బాల్య దశలోనే అంబర్‌పేట నాట్య మయూరిగా అందరి ప్రశంసలు అందుకుంటోంది. కార్తీకమాసాన్ని పురస్కరించుకొని బుధవారం అరుణాచలం ఆలయంలో నారాయణిరావు కూచిపూడి నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. చిన్నారి అభినయానికి ముగ్ధులైన నిర్వాహకులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

గ్రామదేవతలను పూజిస్తే ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

అంబర్‌పేట: గ్రామదేవతలను పూజిస్తే ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బోనాలు, గ్రామదేవతలకు నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాలు హైదరాబాద్ సంస్కృతికి ప్రత్యేక అద్దం పడుతాయని ఆయన వెల్లడించారు. నగరంలోని ప్రధాన అమ్మవారి ఆలయాల్లో అంబర్‌పేట మహంకాళి ఆలయం ఒకటని ఆయన తెలిపారు. అంబర్‌పేట మహంకాళి ఆలయం ఎదురుగా జరుగుతున్న బొడ్రాయి పునః ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు బి.పద్మా వెంకట్‌రెడ్డి, విజయకుమార్‌గౌడ్‌లతో కలిసి తలసాని హాజరయ్యారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి మొక్కలు సమర్పించుకున్నారు. అంతకుముందు ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు బొడ్రాయి పునః ప్రతిష్ఠ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బొడ్రాయి పునః ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు దుర్గప్రసాద్‌రెడ్డి, పి.జ్ఞానేశ్వర్‌గౌడ్, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, వై.శంకర్‌గౌడ్, గిరిధర్‌గౌడ్, మల్లికార్జున్‌గౌడ్, శ్రీనివాస్ ముదిరాజ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.





అంబర్‌పేట మహంకాళి ఆలయ బొడ్రాయి పునః ప్రతిష్ఠ ఉత్సవాల్లో మాజీ మంత్రి తలసాని, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఎమ్మెల్యే దానం నాగేందర్, నిర్వాహకులు

'సదర్ ఉత్సవాలు యాదవుల్లో ఐక్యతను పెంచుతున్నాయి'

ముషీరాబాద్: సదర్ ఉత్సవాలు యాదవుల్లో ఐక్యతను పెంపొందించడంతో ఆపటు తమ వృత్తిని కాపాడుకునేందుకు దోహదపడుతున్నాయని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్ అన్నారు. సదర్ ఉత్సవాలకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన ఎడ్ల హరిబాబుయాదవ్‌ను అభినందిస్తూ నారాయణపేట్ యాదవ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆయనకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు బాలప్పయాదవ్ మాట్లాడుతూ.. సదర్ ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంతో పాటు యాదవుల వృత్తిని, ఐక్యతను చాటి చెప్పేలా ప్రతిఏటా వివిధ రాష్ట్రాల నుంచి దున్నలను తీసుకువస్తూ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం సదర్ ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేలా హరిబాబుయాదవ్ ఎంతో కృషి చేశారని ప్రశంసించారు.



ఎడ్ల హరిబాబుయాదవ్‌ను సన్మానిస్తున్న నారాయణపేట్ యాదవ సంఘం నేతలు

◆ ఈ నెల 25న నారాయణ్‌పేటలో జరిగే సదర్ ఉత్సవాలకు హరిబాబుయాదవ్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ్‌పేట్ యాదవ సంఘం కన్వీనర్ రఘువీర్‌యాదవ్, సంఘం నాయకులు తిరుపతి, గోపాల్, కృష్ణ, చిన్నయ్య, శ్రీనివాస్, కేశవులు, వెంకటప్పా, నాగులు తదితరులు పాల్గొన్నారు.

కులాల జనాభాను బట్టి రిజర్వేషన్‌ను అమలు చేయాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కులాలవారీగా జనాభాను బట్టి రిజర్వేషన్‌ను అమలు చేయాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగొని బాలరాజుగౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్ చైర్మన్ విజయ్‌కుమార్‌కుమార్ గౌడ్, బీసీ కులసంఘాల చైర్మన్ కుందారం గణేషాచారీ కోరారు. ఈ మేరకు బుధవారం బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావును తన కార్యాలయంలో కలిసి బీసీలు, గౌడ్‌లకు న్యాయంగా రావాల్సిన హక్కులపై వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో కులగణన సర్వే దాదాపుగా పూర్తి కావొచ్చిందని మొత్తం జనాభాలో సగానికిపైగా బీసీలు ఉంటే అన్ని రంగాలలో అన్యాయం జరుగుతుందన్నారు. వివిధ కులాల వారీగా వార్వారి జనాభాను బట్టి రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం బీసీల హక్కులను కాలరాసిందని అన్నారు. ఉన్న రిజర్వేషన్‌ను కుదించడం వల్ల స్థానిక సంస్థల్లో, మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లో అన్యాయం జరిగిందన్నారు. చట్టసభల్లో రాజకీయ రిజర్వేషన్లు వచ్చేంత వరకు మా పోరాటం ఆగదన్నారు.



బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న బాలరాజుగౌడ్ తదితరులు

రాష్ట్రంలో విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించాలి

- నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి
- ధర్మ సమాజ్ పార్టీ నేతల డిమాండ్

కవాడిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో కేజీ టూ పీజీ వరకు నాణ్యమైన విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించాలని ధర్మ సమాజ్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా కో కన్వీనర్ సంతోష్ మహారాజ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో ధర్మసమాజ్ పార్టీ నేతలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని ఆరోపిస్తూ తహసీల్దార్ రాణాప్రతాప్ సింగ్‌కు వినతి పత్రం అందజేశారు.

◆ ఈ సందర్భంగా సంతోష్ మహారాజ్ మాట్లాడుతూ... తెలంగాణలో అన్ని రంగాలలో రోజురోజుకు ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగం పెరిగిపోతోందన్నారు. వారి అర్హతలను బట్టి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి వారి ఆర్థిక పరిస్థితులు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని అర్హులైన పేదలందరికి ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు.



ముషీరాబాద్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నేతలు

◆ తెలంగాణలో సంక్షేమ పథకాలను పూలే, అంబేడ్కర్, సాహూ మహారాజ్ వంటి సామాజిక ఉద్యమకారుల పేరుమీద పథకాలు అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌పీ నేతలు మనోజ్‌కుమార్, శ్రీధర్, శివకుమార్, పవన్, గణేష్, శ్రావణ్, శివప్రసాద్, మురళీ, మహేష్, సాయిరాం, సంపద్ తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ బస్‌స్టేషన్‌కు అవార్డు

కాచిగూడ: ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ స్థాయిలో కాచిగూడ బస్‌స్టేషన్‌కు ఉత్తమ బస్‌స్టేషన్ అవార్డు వరించింది. బుధవారం దిల్‌సుఖ్‌నగర్ డిపోలో ప్రగతి చక్ర పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ వరప్రసాద్ చేతుల మీదుగా కాచిగూడ డీఎం టి.రఘు ఉత్తమ బస్‌స్టేషన్ పురస్కారాన్ని అందుకున్నారు. డిపో మేనేజర్‌కు ప్రశంస పత్రంతో పాటు రూ.5వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్స్ సుచరిత, జగన్, బాబు నాయక్, అయోధ్య రాములు పాల్గొన్నారు.

నియామకాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రజక ఫిషర్‌మెన్ రాష్ట్ర సొసైటీల జిల్లా కమిటీల నియామకాన్ని బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సొసైటీల కమిటీ వ్యవస్థాపక చైర్మన్ ఆమన గంటి సైదులు నియమించారు. సూర్యపేట జిల్లా అధ్యక్షుడిగా పూస పల్లి శ్రీనివాస్, యాదాద్రి జిల్లా అధ్యక్షుడిగా వడ్లకొండ నర్సింహులు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా రాగల రమేష్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్ శేఖర్, జగిత్యాల ఆరేల్లి శేఖర్, నిజామాబాద్ అధ్యక్షుడు ఏ.సాయన్న, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా అమ్మునూరు రమేష్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఆలేటి మల్లేష్‌ను నియమించారు.

రైలులో నగలు, నగదు బ్యాగు చోరీ

కాచిగూడ: రైల్లో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికురాలి ముక్కుపుడక, నగదు బ్యాగు చోరీ ఘటనపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ కేసు నమోదు చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... బిహార్‌కు చెందిన శుభాకర్ కూతురు కుష్బుకుమారి ఈనెల 17వ తేదీన పాటలీపుత్రం నుంచి కాచిగూడకు బెంగుళూర్ ప్రత్యేక రైల్లో వస్తుంది. రైలు బారాముని జంక్షన్ వద్దకు రాగానే రూ.6వేల నగదు, బంగారు ముక్కు పుడక ఉన్న బ్యాగు చోరీకి గురైంది. బుధవారం బాధితురాలు కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం దానాపూర్ రైల్వే పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

కాచిగూడ: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చెప్పల్ బజార్‌కు చెందిన శ్రీకాంత్ (45) గత నెల 2వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. వివిధ ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో బుధవారం బాధితుడి తమ్ముడు ప్రదీప్ కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మరో ఘటనలో నింబోలిఅడ్డకు చెందిన గృహిణి బి.నాగు (21) మంగళవారం రాత్రి నుంచి కనిపించడం లేదు. బాధితురాలి భర్త పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో, బైక్ దొంగల అరెస్టు

చిక్కడపల్లి: ఓ బార్ వద్ద నుంచి ఆటో, 4 బైక్‌లు దొంగిలించిన ఇద్దరు పాత నేరస్తులను పోలీసులు పట్టుకున్నారు. చిక్కడపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రేమ్ అనే వ్యక్తి తాను నడుపుతున్న అద్దె ఆటోలో ఈనెల 9న సాయంత్రం చిక్కడపల్లిలోని సాయిబార్ వద్ద పార్క్ చేశారు. రాత్రి బయటకు వచ్చేసరికి తన ఆటో కనపడలేదు. దాంతో వెంటనే అతను చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించి కూర్మ రాజు(30), చాకలి బాల్‌రాజు(36)లను అరెస్టు చేశారు. వారి వద్ద నంచి 4బైక్‌లు, ఒక ఆటో, 2 ఫోన్ల స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి భరించలేక బాలుడు ఆత్మహత్య

కాచిగూడ: కడుపునొప్పి భరించలేక ఓ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రవి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... టీ బండిని నడిపే మోతీమార్కెట్ ప్రాంతానికి చెందిన శివ కుమార్ కుమారుడు సీహెచ్ గణేష్ (14) చాదర్‌ఘాట్ ఆర్‌జీ కేడియా స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. అతను కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటింటి సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి

రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్

కవాడిగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని రాజ్యసభ సభ్యుడు మందడి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఈ సర్వేకు ప్రజలు మరింత సహకరించాలని కోరారు. బుధవారం కవాడిగూడ డివిజన్ తాళ్లబస్తీలో సమగ్ర కుటుంబ సర్వే పనితీరును ఆయన ఆకస్మికంగా పర్యవేక్షించి అధికారుల పనితీరు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీలో పాదయాత్ర చేసి స్థానికులతో మాట్లాడుతూ... ఇంటింటి సమగ్ర సర్వే వల్ల ఎవరికి నష్టం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో ప్రజలందరిని భాగస్వాములు చేయడానికి ఈ సర్వే దోహదపడుతుందని అన్నారు. ప్రజలకు ఎలాంటి అనుమానాలు లేకుండా సర్వే అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్ యాదవ్, మాజీ డివిజన్ అధ్యక్షుడు పి.ధర్మేందర్, యువజన సంఘం అధ్యక్షుడు సంగపాక వెంకట్, నేతలు కిట్టు, మల్లేష్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, నోడల్ అధికారి మధు, ఎన్యూమరేటర్లు, సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.



తాళ్లబస్తీలో కుటుంబ సర్వేను పర్యవేక్షిస్తున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, నోడల్ అధికారి

కచ్చామోరి పనులను వెంటనే పూర్తి చేయండి

చిక్కడపల్లి: సమస్యగా మారిన కచ్చామోరి పనులను వెంటనే పూర్తి చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం జవహర్‌నగర్ మెయిన్‌రోడ్డు రూ.50లక్షలతో ఆర్టీసీ క్రాస్ రోడ్డు నుంచి ఇందిరాపార్క్ వెళ్లే దారిలో పనులను చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం, జీహెచ్ఎంసీ ఏఈ సలాం, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌లతో ఆమె పర్యటించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ అధికారులు సమన్వయంతో పనిచేసి వచ్చే సోమవారం వరకు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వినయకుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఉమేష్, నర్సింగ్‌రావు, దోనేటి సత్యం, సురేందర్, సురేష్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో కచ్చామోరి పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావని, నాయకులు

న్యాయ వ్యవస్థలో వస్తున్న మార్పులను గమనించాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: న్యాయ వ్యవస్థలో వస్తున్న మార్పులను గమనిస్తూ ముందుకు సాగాలని జూనియర్ సివిల్ జడ్జ్ సిటీ సివిల్ కోర్టు హైదరాబాద్ సాయికిరణ్ కాసమాల అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలలో ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ సందర్భంగా సాయికిరణ్ కాసమాల మాట్లాడుతూ... విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలు తెలుసుకొని నూతన దృక్పథంతో ఆలోచించాలని సూచించారు. నేటి ఆధునీకకాలంలో నిరంతరం అధ్యాయనం చేస్తేనే తాము ఎంచుకున్న రంగంలో రాణించగలుగుతారని అన్నారు.

◆ ప్రొఫెసర్ డాక్టర్ రాధికాయాదవ్ మాట్లాడుతూ... క్రమశిక్షణ గల విద్య ఉన్నత శిఖరాలను చేర్చుతుందన్నారు. విద్యార్థులు నింతర అధ్యాయనం చేస్తేనే పరిపూర్ణ జ్ఞానాన్ని సంపాదించగలరని అనినారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్ మాట్లాడుతూ... ఉన్నత విలువలతో కూడిన విద్యను అందజేయడానికి తాము ఎంతగానో కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సృజన, కార్యదర్శి జి. రమ, డైరెక్టర్ ప్రొ. విష్ణుప్రియా, అసిస్టెంట్ ప్రొ. పీవీఎస్ శైలజ, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.



ఓరియంటేషన్ డేలో మాట్లాడుతున్న న్యాయవాది సాయికిరణ్

కల్యాణం.. కమనీయం

వైభవంగా భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణ మహోత్సవం



కోటి దీపోత్సవ ప్రాంగణంపై భద్రకాళి భద్రేశ్వరుల కల్యాణం

కవాడిగూడ: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని ఎన్‌టీఆర్ స్టేడియంలో భక్తిటీవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవం బుధవారానికి 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అత్యంత వైభవంగా వరంగల్ భద్రకాళి భద్రేశ్వర కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం కోటి దీపోత్సవ వేదికపై బాసర సరస్వతి దేవి మహాపూజ, భక్తులతో స్వయంగా జ్ఞాన ప్రదాయిని పుస్తక పూజ చేయించారు. ఈ సందర్భంగా పుష్పగిరి మహాసంస్థానం విద్యాశంకరభారతి మహాస్వామి, తలకాడు శ్రీదత్త పద్మనాభ పీఠం సద్గురు శ్రీబ్రహ్మేశ్వరానంద ఆచార్య స్వామీజీ ఆశీర్వచనం అందించారు. డాక్టర్ బాచంపల్లి సంతోష్‌కుమార్ ప్రవచనామృతాలు వినిపించారు.



హాజరైన భక్తులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నిమిత్తం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏడీఈ జి.నాగేశ్వర్‌రావు తెలిపారు.

◆ సీఈకాలనీ ఫీడర్ పరిధిలోని శివం, శారదానగర్, సాయిబాబా నగర్, ఈసేవా, బాగ్‌అంబర్‌పేట్ తదితర ప్రాంతాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు..

◆ బతుకమ్మకుంట ఫీడర్ పరిధిలోని పాములబస్తీ, మల్లన్నటెంపుల్, గంగానగర్, పోచమ్మబస్తీ తదితర ప్రాంతాలలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు..

◆ సంజీవయ్యనగర్ ఫీడర్ పరిధిలోని తిలక్‌నగర్, మీసేవా, శివాలయం టెంపుల్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి 3.30గంటల వరకు,

◆ శివాలయం టెంపుల్ ఫీడర్ పరిధిలోని తాడి కంపౌండ్, బాలాజీ ఆర్కేడ్, కూరగాయాల మార్కెట్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

కులగణన సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలి

సామాజికవేత్త ఆళ్ల రామకృష్ణ

కాచిగూడ: సమగ్ర కుటుంబ సర్వే కులగణనకు ప్రజలందరూ పూర్తిస్థాయిలో సహకరించి విజయవంతం అయ్యేలా కృషి చేయాలని ప్రముఖ సామాజికవేత్త ఆళ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావును బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి పలు సూచనలు, సలహాలతో కూడిన వినతి పత్రం అందజేసినట్లు ఆయన ఒక ప్రకటనలతో తెలిపారు. అనంతరం ఆళ్ళ రామకృష్ణ మాట్లాడుతూ.. కులగణన సర్వేలో అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. సమగ్ర కులగణన కోసం ఎన్యుమరేటర్లను పెంచి కులగణన పక్కాగా జరిగే విధంగా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

◆ బీసీ కులాల్లో ఏ,బీ,సీ,డీ వర్గీకరణ ఉండేలా చూడాలన్నారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచే విధంగా సమగ్ర కులగణన సర్వే ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తమిళనాడులో నైన్త్ షెడ్యూల్‌లో పెట్టి చేపట్టిన కులగణన విజయవంతమైన విధంగా మన రాష్ట్రంలో కూడా న్యాయపరమైన చిక్కులు లేకుండా ఈ సమగ్ర సర్వే జరగాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సోదరులు ఈ సర్వేకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వీరప్పయాదవ్‌కు నివాళి

కాచిగూడ: యాదవ జాతీ సంక్షేమం, అభివృద్ధి కోసం యాదవ రత్న చిట్టబోయిన వీరప్పయాదవ్ అందించిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. వీరప్పయాదవ్ 10వ వర్ధంతి సందర్భంగా బుధవారం చెప్పల్‌బజార్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్లు, బిస్కెట్స్, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు వి.పాండుయాదవ్, చిట్టి శ్రీధర్, ఎక్కాల కన్నా, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్, దశరథ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థను పూర్తిస్థాయిలో నిర్మూలిస్తాం

కార్మికశాఖ అడిషనల్ కమిషనర్ గంగాధర్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: బాలకార్మిక వ్యవస్థను పూర్తిస్థాయిలో నిర్మూలిస్తామని కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ గంగాధర్ అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆశ్రయ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ... 18 సంవత్సరాలలోపు చిన్నారులంతా బడిబాట పట్టేలా తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. బడికి వెళ్తేనే వారి భవిష్యత్ బంగారుబాట అవుతుందన్నారు. చిన్నారులను దుకాణాలలో కానీ ఇతర సంస్థల్లో కానీ చేర్చుకొని పనిచేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దుకాణాలలో చిన్నారులతో పనిచేయిస్తే ప్రజలు తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ చైర్మన్ ఆర్.వెంకటరెడ్డి, డాక్టర్ శాలిని, ఆశ్రయ్ ఫౌండేషన్ సెక్రటరీ మల్లారెడ్డి, అంకిత ఫౌండేషన్ ప్రతినిధి స్టీఫెన్ డానియల్, శ్రీలత, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు

తప్పిన పెను ప్రమాదం



ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు అంటుకుని పూర్తిగా కాలిపోయింది. కాంగ్రెస్ నేత జీఎన్ చారి విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వెంటనే వారు అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్తాచెదారం ఉండటంతో చెత్తకు మంటలు అంటుకొని ట్రాన్స్‌ఫార్మర్‌కు వ్యాపించడడం వల్లే అగ్ని ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్‌శాఖ ఏఈ సునిల్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మరమ్మతు పనులు నిర్వహించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.